ప్రజాశక్తి
శుక్రవారం 2 జనవరి 2026
5
శ్రీ సత్యసాయి

ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

మిగిలిన చెరువులకూ నీరివ్వండి

ఇరిగేషన్ అధికారులకు మంత్రి సవిత ఆదేశం

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ నియోజకవర్గంలో మిగిలిన చెరువులకూ నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులను రాష్ట్ర బిజి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశించారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాల యంలో మంత్రి గురువారం ఇరిగేషన్ ఎస్ఈ స్వరూప్, ఇంజినీర్లు మురళి, శ్రీనివాస్, తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో మిగిలిన చెరువులను తక్షణమే నింపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిగి చెరువు, కోగిర, చాలకూరు, పెనుకొండ చెరువులకు ఫీడర్ చానల్ ఏర్పాటు, గుడిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై కూడా చర్చించారు. వేసవిలో తాగు, సాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇరిగేషన్ శాఖకు చెందిన ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి సవితకు పుస్తకాలు అందిస్తున్న అభిమానులు

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

◆ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

◆ అధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద సందడి

'న్యూ'తన శోభ..!

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని అంటాయి. కోటి ఆశలతో సరికొత్త ఆకాంక్షలతో ప్రజలు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. చిన్నాపెద్దా అన్న తేడా లేకుండా అందరూ సంతోషంగా వేడుకలు జరుపుకున్నారు. బుధవారం అర్ధరాత్రి 2025కు టాటా చెప్పి 2026కు స్వాగతం పలికారు. గురువారం ఉదయం ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలుపుకున్నారు. చిన్నారులు కొత్త దుస్తులు ధరించి తోటి మిత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాజకీయ పార్టీ నాయకుల నివాసాలు సందర్శకులతో కిటకిటలాడాయి. తమ అభిమాన నాయకునికి శుభాకాంక్షలు చెప్పేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. అధికారులు కూడా వారి ఉన్నత శాఖ అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం అధికారులు, ప్రజలు, సందర్శకులతో కిక్కిరిసింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం అర్ధరాత్రి యువత వేడుకలను చేసుకుంది. కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. గురువారం ఉదయం మిత్రులు, బంధువులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకుల ఇళ్ల వద్ద ఆయా పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపేందుకు బారులుదీరారు.

సురక్షిత ప్రయాణమే నూతన సంవత్సర సందేశం : కలెక్టర్

ప్రమాద రహిత జిల్లానే లక్ష్యం కావాలని, ఆ దిశగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. 37వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా రవాణా అధికారులతో కలిసి రహదారి భద్రతకు సంబంధించిన కరపత్రాలు, అవగాహన బ్యానర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 37వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను జిల్లాలో 31 వరకు పటిష్టంగా నిర్వహించనున్నామన్నారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా ప్రజలకు, వాహనదారులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. జాతీయ రహదారిపై హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. అలాగే కార్లు నడిపే వారు విధిగా సీటుబెల్ట్ ధరించాలని సూచించారు. రహదారి సూచనలు, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడంతోనే ప్రమాదాలను తగ్గించి శ్రీ సత్య సాయి జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దగలమని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత భద్రతకే కాకుండా ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకొని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి ఎన్.ఎన్. కరుణసాగర్ రెడ్డి, కదిరి ప్రాంతీయ రవాణా అధికారి జె.శ్రీనివాసులు, మోటార్ వాహనాల తనిఖీ అధికారి డీఎస్ఎం వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులకు కాదు సేవకే పట్టం :

2026 నూతన సంవత్సర వేడుకలను సేవా భావంతో ప్రారంభించాలన్న జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ పిలుపుకు అనూహ్యమైన స్పందన లభించింది. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు సంప్రదాయానికి భిన్నంగా సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. డిసెంబర్ 30న జిల్లా కలెక్టర్ ఇచ్చిన పిలుపు మేరకు ఈసారి పూలదండలు, పూల బొకేలు, కేకులు, శాలువాలకంటే సమాజానికి నిజంగా ఉపయోగపడే సేవలకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ పిలుపును గౌరవించిన వారు నూతన సంవత్సర శుభాకాంక్షలతో పాటు జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు ఉన్నత ఉద్యోగ పోటీ పరీక్షలకు ఉపయుక్తమైన పుస్తకాలు, అవసరంలో ఉన్నవారికి బెడ్‌షీట్లు, పోషకాహార కిట్లు అందజేయడంతో పాటు నగదు, వస్తువుల రూపంలో అందించారు.

మంత్రి సవితకు శుభాకాంక్షల వెల్లువ

పెనుకొండ : ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా గురువారం బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని మంత్రి కార్యాలయం, నివాసం వద్దకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూల దండలు, బొకేలు, శాలువాలకు బదులు నోట్ పుస్తకాలు, పెన్నులు తీసుకొచ్చి మంత్రికి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సైతం వారితో ఆప్యాయంగా మాట్లాడుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అన్నింటా శుభాలు జరుగుతాయని ఆకాంక్షిస్తున్నామన్నారు.

కొత్తచెరువులో పడకేసిన పారిశుధ్యం..!

రోడ్లపై మురుగు.. చెత్త కుప్పలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

సచివాలయం-3 వద్ద పేరుకుపోయిన చెత్త

కొత్తచెరువు గ్రామపంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రధానంగా పలు వీధుల్లో డ్రైనేజీ కాలువలు లేక రోడ్లపైనే మురుగు నీరు పారుతోంది. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాల్సి ఉంది. అయితే వారు సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక స్థానిక పుట్టపర్తి రోడ్డులో సందీప్ థియేటర్ ముందు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఇళ్లలోని వృథా నీటిని రోడ్లపైకి వదులుతున్నారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు వేశారు కానీ డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డపైకి చేరి అపరిశుభ్రత నెలకొంది. బుక్కపట్నం రోడ్డు గాంధీనగర్ పాఠశాల వద్ద నుంచి మరవంక వరకూ ఉన్న మురికినీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తీయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని పరిసర ప్రాంతాల్లోని ప్రజలు వాపోతున్నారు. ఇక సచివాలయం-3 వద్ద చెత్త చెదారం కుప్పలు కుప్పలుగా పేరుకుపోయింది. దీంతో సచివాలయ ఉద్యోగులు, పని మీద సచివాలయం వెళ్లే ప్రజలు దుర్వాసన భరించలేకున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నడిరోడ్డుపైకి చేరిన మురుగునీరు

క్రికెటర్ దీపికకు సన్మానం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

ఇటీవల జరిగిన అంధుల టీ-20 మహిళల ప్రపంచకప్ క్రికెట్‌లో భారత జట్టు విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ఆ జట్టుకు అమరాపురం మండలానికి చెందిన దీపిక కెప్టెన్‌గా వ్యవహరిం చారు. ఆమెను గురువారం మండలంలోని నీలకంఠాపురం గ్రామ జడ్పీ హైస్కూల్‌లో సిడబ్ల్యుసి సభ్యు లు, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. రఘువీరారెడ్డి మాట్లాడుతూ దీపిక కన్ను కోల్పోయి పాఠశాలకు వెళ్లగా తోటిపిల్లలు అంధురాలని గేలి చేశారన్నారు. అయినా దీపిక ఏమాత్రం మొక్కవోని దీక్షతో పట్టుదలగా సాధన చేసి అంధుల టీ-20 భారత క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడంతో పాటు అంధుల టీ-20 ప్రపంచ కప్ పోటీల్లో జట్టును విశ్వవిజేతగా నిలిపారని కొనియాడారు. దీంతో దేశవ్యాప్తంగా ఆమె పేరు మార్మోగిందన్నారు. జిల్లాతో పాటు రాష్ట్రం, దేశానికి పేరు తెచ్చిన దీపికను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే దీపిక గురువు మహంతేష్ కర్నాటకలో సమర్థనం ఫౌండేషన్ పేరుతో వికలాంగులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఎవరైనా అత్యున్నతస్థాయికి ఎదిగారంటే అందుకు ఇలాంటి గురువులే కారణం అన్నారు. మహంతేష్ వికలాంగుల కోసం 29 పాఠశాలలు నిర్వహిస్తూ సుమారు 10వేల మందిని ఆదుకుంటున్నారన్నారు. దీపికకు కేంద్ర ఆదాయపన్నుల శాఖలో ఉద్యోగం ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దీపిక ఉప ముఖ్యమంత్రిని కలిసినప్పుడు ఆయన మీకు ఏం కావాలని కోరగా తమ ఊరికి రోడ్డు వేయించాలని నిస్వార్థంగా కోరడం ఆమె సేవానిరతికి నిదర్శనమన్నారు. రోడ్డు కోసం రూ. 6.5 కోట్లు సాధించుకొచ్చిందని, అందుకు కరళతాళ ధ్వనులతో అభినందించారు. అనంతరం దీపికకు రూ. లక్ష, సమర్థనం ఫౌండేషన్‌కు రూ. లక్ష చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో దీపిక గురువు మహంతేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

క్రికెటర్ దీపికను సన్మానించిన రఘువీరారెడ్డి, తదితరులు

గురువే దైవం : దీపిక

కన్ను లేదని ఊరిలోనే అవమానాలు ఎదుర్కొన్నాను. తమ తల్లిదండ్రులు కూలి పనులకు పోయి చదించారు. అలాగే ప్రతి తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో తమను చదివిస్తారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయక చదవాలని విద్యార్థులను కోరారు. మా గురువు మహంతేష్ తనలోని ఆసక్తిని గమనించి అటువైపుగా ప్రోత్సహించడంతోనే ఈ రోజు నేను ఇలా ఉన్నానన్నారు. ఈ విజయం నా గురువుకు అంకితం అన్నారు.

గురువుకు రఘువీరారెడ్డి పాదపూజ

ప్రజాశక్తి-మడకశిర రూరల్



గురువుకు పాదపూజ చేస్తున్న రఘువీరారెడ్డి

మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో గురువారం రిటైర్డ్ ఉపాధ్యాయులు హను మంత రాయప్ప దంపతులకు సిడబ్ల్యుసి సభ్యులు ఎన్. రఘువీరారెడ్డి పాదపూజ చేసి ఆశీర్వాదం పొందారు. రఘువీరా రెడ్డి తన స్వగ్రామమైన నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో చదువుకునే రోజుల్లో హనుమంతరాయప్ప ఉపాధ్యాయుడిగా పని చేశారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువు దంపతులకు రఘువీరారెడ్డి తన తరగతి సహచరులతో కలిసి పాదపూజ చేసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే గురువు ఆశీర్వాదం పొందారు. వారు గురుశిష్యుల అనుబంధం, నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రఘువీరారెడ్డి తరగతి సహచరులు గోవిందరాజులు, విశ్వనాథ గుప్తా, బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పురం' బ్యాంకు దోపిడీలో

కీలక నిందితుడు అరెస్టు

వివరాలు మెయిన్‌లో..

స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను చూపుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

ఎపిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో గురువారం ఎంఇఒ ఆంజనేయులు నాయక్ ఎపిటిఎఫ్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎపిటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యా యుల సమస్యల పరి ష్కారం, హక్కుల కోసం ఎపిటిఎఫ్ రాజీ లేని పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి అనేక రకాలుగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు జవ్వాజి నాగరాజు, చంద్ర, గౌరవాధ్యక్షులు దస్తగిరి, అధ్యక్షులు శివన్న, ప్రధాన కార్యదర్శి గణేష్, నాయకులు విజయ్ కుమార్‌నాయక్, ఇర్ఫాన్, రంగేష్‌కుమార్, ప్రసాద్‌నాయక్, రంగే నాయక్, మధు, రమేష్, నరసింహ మూర్తి, నాగరాజు, రాజా రమేష్, హనుమంతరాయుడు, ఆనంద్, నాగచంద్రశేఖర్, కాలయ్య, వినోద్ నాయక్, ఉపేంద్ర, శీనానాయక్, శ్రీనివాసులు, మారుతి ప్రసాద్, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి-గుడిబండ

మడకశిరను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్.రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని అన్ని సచివాలయ కేంద్రాల్లో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, అనగాని సత్యప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేయనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీ నరసప్ప, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప తెలిపారు.

పొలంలో విద్యుత్ తీగ తగిలి ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని చిన్నకోడిపల్లి గ్రామ సమీపంలో రైతులు గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డిలకు పక్క పక్కనే పొలాలు ఉన్నాయి. వీరిద్దరూ వరి పంట సాగు చేయగా కోత దశలో ఉంది. వీరి పొలాల మీదుగా 11 కెవి విద్యుత్ లైన్ వెళ్తోంది. గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి వారి వారి పొలాల్లోకి వెళ్లి 11 కెవి లైన్‌కు రాగి వైరు తగిలించి పంట పొలంలోకి వదిలారు. అదే గ్రామానికి చెందిన చాకలి రామాంజి పశువులకు గడ్డి కోసం వెళ్లగా రాగి వైరు తాకడంతో విద్యుత్ సరఫరా జరిగి తీవ్ర గాయాలతో అక్కడే పడిపోయారు. సమీపంలో ఉన్న రైతు కృష్ణారెడ్డి గమనించి అప్రమత్తమై రామాంజిని బయటకు తీసుకొచ్చారు. అలాగే విద్యుత్ అధికారులకు విషయం తెలిపి కొద్దిసేపు విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. బాధితుడు రామాంజికి రొద్దం ఆసుపత్రిలో చికిత్స చేయించారు. 3 నెలల క్రితం కూడా రైతు గోపాల్‌రెడ్డి పొలంలో ఇలా విద్యుత్ వైర్లు తగిలించారని, ఎవరో ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి పనులు చేస్తున్నట్లు రైతులు వాపోయారు. ఈ విషయంపై రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

తాడంగిపల్లిలో ఆవుకు చికిత్స

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని తాడంగిపల్లి గ్రామానికి చెందిన పాడిరైతు దూదేకుల బాబుకు చెందిన జెర్సీ ఆవుకు పశువైద్య సిబ్బంది విజయవంతంగా చికిత్స చేయగా పెయ్య దూడకు జన్మనిచ్చింది. వివరాలు.. ఆవుకు ఏదో సంచి లాగా వేలాడుతూ ఉండడంతో రైతు కంగారు పడి గోపాలమిత్ర రాజశేఖర్‌కు విషయం తెలిపాడు. వెంటనే అతడు మరొక గోపాలమిత్ర శివప్రసాద్ కలిసి తాడంగిపల్లి గ్రామం వెళ్లి ఆవుని పరిలించి సమస్యను గుర్తించారు. వారి వెంట తీసుకెళ్లిన పరికరాలు, మందులతో విజయవంతంగా చికిత్స చేయడంతో పెయ్యదూడ పుట్టింది. అలాగే రైతులకు తగిన సూచనలు చేశారు. ఆవుకు ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో రైతు సంతోషం వ్యక్తం చేశాడు. పశువులకు ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే గోపాల మిత్రకు సమాచారం ఇవ్వాలని పశు వైద్యాధికారి జాహ్నవి తెలపారు. వారితో పాటు రాజశేఖర్, శివ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన నమూనాతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

రాష్ట్రస్థాయికి 'హేమావతి' నమూనా ఎంపిక

ప్రజాశక్తి-అమరాపురం

మండలంలోని హేమావతి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన నమూనా రాష్ట్రస్థాయి కెరీర్ గైడెన్స్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం లీలారాణి తెలిపారు. సమగ్ర శిక్ష ఎపిసి దేవరాజ్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి వాటిని అందుకునే ప్రయత్నం చేయాలని విద్యార్థులకు సూచించారు. కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గత మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి కెరీర్ గైడెన్స్ ప్రదర్శనలో 13 విభాగాల్లో 2,548 నమూనాలను ప్రదర్శిం చారు. ప్రతి విభాగం నుంచి ప్రథమ స్థానంలో నిలిచిన 13 నమూనాలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందజేశారు. అందులో భాగంగా హేమావతి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన కెరీర్ గైడెన్స్ రాష్ట్రస్థాయికి ఎంపికైందని హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్ఎస్ఎస్ శిబిరంలో 'పురం ' విద్యార్థిని సత్తా

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం బీఏ చదువుతున్న విద్యార్థిని ఎం. ఫరీదా వారం రోజుల పాటు జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని విజయవంతంగా తిరిగి రావడం అభినందనీయ మని కళాశాల ప్రిన్సిపల్ డా. ఎంప్రగతి పేర్కొన్నారు. కళాశాలలోని ప్రిన్సిపల్ ఛాంబర్ లో గురువారం విజయవంతంగా తిరిగి వచ్చిన ఫరీదాను అందరు అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఎస్కే యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యం లో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో ఫరీదా ఎన్ఎస్ఎస్ వాలంటీర్ గా చురుకుగా పాల్గొనడంతో ఆమెను జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం మల్కాజ్‌గిరిలో వారం రోజుల పాటు నిర్వహించిన ఈ శిబిరంలో దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొనగా, అందులో ఫరీదా పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రదర్శించడం ప్రశంసనీయమని అన్నారు. అనంతరం జాతీయ సమైక్యత శిబిరంలో అందజేసిన సర్టిఫికెట్ ను ఆమెకు అందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. శ్రీలక్ష్మి, అధ్యాపకులు భోజప్ప, వై.ఆర్. రమేష్, డా. రవినాయక్, అనూష, నసీమా భాను, ఎన్ఎస్ఎస్ అధికారి రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ బి. నరసింహులు, విద్యార్థిని సంరక్షకులు, తోటి విద్యార్థులు పాల్గొని ఫరీదాను అభినందించారు.

ఫరీదాను అభినందిస్తున్న ప్రిన్సిపల్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

బెంగళూరులో రామాంజనేయులు అంత్యక్రియలు

పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

ఎమ్మెల్యే పరిటాల సునీత మరిది(చెల్లెలు భర్త) గుంటూరు రామాంజనేయులుకి కన్నీటి వీడ్కోలు పలికారు. ఆత్మకూరు మండలంలోని పి.సిద్ధరాంపురం గ్రామానికి చెందిన గుంటూరు రామాంజనేయులు గత నెల 24వ తేదీ అమెరికాలో గుండెపోటుతో మృతిచెందారు. పరిటాల సునీత చెల్లెలు లక్ష్మీ భర్త అయిన రామాంజనేయులు దంపతులు బెంగళూరులో స్థిర పడ్డారు. వారి పెద్ద కుమారుడు మంజునాథ్‌కు ఇటీవల కుమారుడు జన్మించగా గత నెల 13వ తేదీ రామాంజనేయులు దంపతులు అమెరికా వెళ్లారు. కుటుంబ సభ్యులంతా సంతోషంగా గడుపుతున్న సమయంలో రామాంజనేయులు గత ఎల 24వ తేదీ హఠాత్తుగా గుండెపోటుతో మృతిచెందారు. ఆయన మృతదేహం గురువారం తెల్లవారుజామున బెంగళూరులోని కెంపాపురలోని రాయల్ ఎన్ క్లేవ్ లే అవుట్‌లో ఉన్న ఆయన నివాసానికి చేరుకుంది. అక్కడ ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామాంజనేయులుతో ఉన్న అనుబంధాన్ని వారు గుర్తు చేసుకున్నారు. వీరితో పాటు పరిటాల, ధర్మవరపు, గుంటూరు వారి కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు తరలివచ్చి ఆయనకు నివాళులర్పించారు. మధ్యాహ్నం 12గంటలకు హెబ్బాల్ సమీపంలోని ఎస్టీమ్ మాల్ పక్కన ఉన్న హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

రామాంజనేయులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీత, ప్రముఖులు

పారిశుధ్య కార్మికులకు భోజనం ఏర్పాటు

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఆంగ్ల నూతన సంవత్సరం పురస్కరించుకొని గురువారం సోమందేపల్లికి చెందిన పరంధామ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు మేజర్ పంచాయతీలో పని చేసే పారిశుధ్య కార్మికులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం గ్రీన్ చికెన్, చికెన్ కర్రీ, ఎగ్ ఫ్రైడ్‌రైస్ అందించారు. కార్యక్రమంలో నిమ్మకాయల పరంధామ, కందికుంట నవీన్, సంతోష్, నీరుగంటి మోహన్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

స్టిక్కర్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

యుటిఎఫ్ జిల్లా శాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని డిఇఒ కిష్టప్ప గురువారం ఆవిష్కరించారు. స్థానిక ఎంఆర్‌సి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రా రెడ్డితో కలసి డిఇఒ కిష్టప్ప యుటిఎఫ్ డైరీని, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా డిఇఒ మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోనే కాకుండా సామాజిక దృక్పథంతో సమాజ సేవ కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ నాయక్, జిల్లా కార్యదర్శి పి అమర్ నారాయణరెడ్డి ధర్మవరం మండల విద్యాశాఖ అధికారులు రాజేశ్వరి, గోపాల్ నాయక్ కొత్తచెరువు మండల విద్యాశాఖ అధికారి జయచంద్ర రాష్ట్ర కౌన్సిలర్ మేరీ వర కుమారి, సిపిఎస్ సబ్ కమిటీ కన్వీనర్ బిల్లే రామాంజనేయులు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జింక హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం వందమందికి దాతల సహకారంతో రజని, రక్త బంధం ట్రస్ట్ అధ్యక్షుడు కన్నా వెంకటేష్ అన్నదానం చేశారు. దాతలు విష్ణుప్రియ, సుప్రీత పేరుమీద వారి తల్లిదండ్రులు రాఘవేంద్ర, అమల ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతలకు ట్రస్టు తరుపున కృతజ్ఞతతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాజ సేవకుడు, కౌన్సిలర్ కేత లోకేష్, చంద్రశేఖర్ రెడ్డి, ఉదయ్ కుమార్, హరికృష్ణ, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'ప్రజాశక్తి' సేవలు ఆదర్శనీయం : ఎస్పీ

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

బుక్కపట్నంలో ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రజాశక్తి దినపత్రిక చేస్తున్న సేవలు ఆదర్శనీయమని ఎస్పీ సతీష్‌కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కొనియాడారు. గురువారం పుట్టపర్తి జిల్లా కార్యాలయంలో జిల్లా ఎస్పీ ప్రజాశక్తి కోర్టు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజాశక్తి నిరంతరం ప్రజా సమస్యల పైన పనిచేస్తూ అందరి అభిమానాలను చూరగొంటోందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి పత్రిక ఎంతో కాలం నుండి ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తుందన్నారు. మంచి విలువలు పాటిస్తూ ప్రజల సమస్యలు సమ సమాజంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తెస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి విలేకరులు మహేష్, కొత్తచెరువు శ్రీరాములు, రూరల్ విలేకరి లక్ష్మీనారాయణ, బుక్కపట్నం శ్రీనివాసులు, స్థానిక తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : ప్రజాశక్తి నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టిసి వరుణ్, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ తదితరులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రజాశక్తి దినపత్రిక చేస్తున్న కృషిని అభినందించారు. పత్రికా రంగంలో ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మలిరెడ్డి, గంగాధర్ నాయుడు, జనసేన యువనాయకుడు తోట అనిల్ కుమార్, డీలర్ల సంఘం అధ్యక్షుడు హరి, సయ్యద్ బాషా, రాయల్ రమణ, భాస్కర్, జబీబుల్లా, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : ప్రజాశక్తి 2026 క్యాలెండర్‌ను సిఐ సునీత గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాశక్తి దిన పత్రిక విలువలను పాటిస్తూ ప్రజా సమస్యలను సమాజంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తెస్తోందన్నారు. ప్రజాశక్తికి తెలుగు పత్రికా రంగంలో ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ జన్మదినోత్సవం సందర్భంగా రోడ్లు భవనాల అతిథి గృహంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌ను యుటిఎఫ్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు మల్లికార్జున, రవి వర్ధన్ రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సునీల్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆజమ్ బాషా, మధుసూదన్, సంతోష్ కుమార్ మరియు యుటిఎఫ్ నాయకులు నూతన సంవత్సర మరియు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కదిరి డి.ఎస్.పి , కదిరి మున్సిపల్ చైర్ పర్సన్ కె.ఎస్. దిల్షాదున్నిసా ,మున్సిపల్ కమిషనర్ , కదిరి సిఐనికలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ఎంఆర్‌సి ఆవరణలో కదిరి పరిసర ప్రాంతాలకు చెందిన మండల విద్యాశాఖ అధికారులు చెన్నక్రిష్ణ,తిరుపాల్ నాయక్, వేమనారాయణ, కృష్ణానాయక్, జీలాన్, శ్రీనివాసులు,సురేష్, చెన్నకేశవ కుమార్ తదితరులు కేక్ కట్‌చేసిఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న యుటిఎఫ్ నాయకులు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కదిరి అర్బన్

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పేదల సేవలో కార్యక్రమానికి ఎంపికైన తలుపుల మండల పరిధిలోని పెద్దన్నవారిపల్లి గ్రామానికి చెందిన రెండు కుటుంబాలకు 5 లక్షల రూపాయల విలువైన చెక్కును ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం పంపిణీ చేశారు. తలుపుల మండలానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చినప్పుడు పేదల సేవలో కార్యక్రమానికి ఎంపికచేసిన రెండు కుటుంబాలకు ఐదు లక్షల రూపాయలను గురువారం అందజేశామన్నారు.

ఆఫర్ల మోత... తూకాల్లో కోత

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రజల ఉత్సాహాన్ని ఆసక్తిని ఆసరాగా చేసుకున్న పలువురు వ్యాపారులు ఆఫర్ల ముసుగులో తూకాల్లో కోత విధించారు. నూతన సంవత్సరం సందర్భంగా పలు బేకిరీల్లో భారీ ఎత్తున కేక్‌లు తయారు చేశారు. వాటికి పలు రకాలైన ఆఫర్లను ప్రకటిస్తూ తక్కువ ధరలు అంటూ వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఆఫర్ల ముసుగులో తూకాల్లో భారీస్థాయిలో కోత విధించిన విషయం బుధవారం రాత్రి అధికారులు నిర్వహించిన దాడుల్లో బయట పడింది. బుధవారం రాత్రి లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ జి శివశంకర్ పట్టణంలో ఉన్న పలు బేకరీలను తనిఖీ చేశారు. కేజీ కేకులో 200 గ్రాములు తూకం తక్కువగా ఉన్నట్లు బయట పడింది. ఆఫర్ల ముసుగులో వ్యాపారులు చేస్తున్న మోసం అధికారుల తనిఖీల్లో బయట పడింది. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు.

'సాగరమాల' సుందరీకరణ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాలను కలుపుతూ సత్యసాయి సాగరమాల సుందరీకరణ ప్రాజెక్టుగా మార్చాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిని రిటైర్డ్ హెచ్ఎం లింగన్న కోరారు. ఆయన రూపొందించిన డిపిఆర్‌ను ఎమ్మెల్యేకి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా లింగన్న మాట్లాడుతూ సత్య సాయి బాబా శతజయంతి వేడుకలను ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహించిందని ఈ వేడుకలకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి,గవర్నర్ హాజరయ్యారన్నారు. ఈ వేడుకలు అంతర్జాతీయంగా ప్రత్యేకత గాంచాయన్నారు. ఈ మూడు మండలాలు చుట్టూ అవుటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని బుక్కపట్నం చెరువు కట్టకు కాంక్రీట్ వేసి రిజర్వాయర్ గా మార్చాలని చెరువు కట్ట పైన వెడల్పు చేసి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి సిమెంట్ బెంచీలు వేయాలని కోరారు. చెరువు మధ్యలో సత్య సాయి బాబా వందఅడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు. అదేవిధంగా బుక్కపట్నం చెరువులో బోటింగ్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఈ ప్రాజెక్టును తక్షణమే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు.

వైద్య శాఖలో పలువురికి ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వైద్యశాఖలో పలువురికి ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో స్టాటికల్ అధికారిగా పని చేస్తున్న కళాధర్ డిఎంహెచ్ఒ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. గత నెలలో శ్రీ సత్య సాయి బాబా శత జయంతి వేడుకల సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపులు, ఇతర సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న పలువురిని ప్రశంసిస్తూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ,వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్ హెచ్ఒతో పాటు ఆర్‌బిఎస్‌కె అధికారి డాక్టర్ సునీల్, డిపిఒ నాగరాజు, ఎంయు నైజేషన్ అధికారి డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కదిరిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో "సత్యభారత్ " నేషనల్ ఫౌండషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ ఉదండం చంద్రశేఖర్ అధ్యక్షతన "కదనసింహం కందికుంట" గీతావిష్కరణ సభ నిర్వహించారు. ఈటీవీ పాడుతా తీయగా ఫేమ్ సుధాకర్ ఆలపించిన "కదిరంటే.. కందికుంట గుండెరా" అనే ప్రత్యేక గీతాన్ని ఎమ్మెల్యే అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కదిరి ఆధ్యాత్మిక స్థల చరిత్రకు సంబంధించి మరింత ప్రాచుర్యం తేవాలని సంకల్పించామని, అందులో భాగంగా తిమ్మమ్మ మర్రి, వేమన క్షేత్రాలను భావి తరాలు గుర్తుంచుకునేలా అభివృద్ధి చేస్తామని అన్నారు. కదిరి ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని, ప్రతి ఇంటా ఆర్థిక సుస్థిరాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి, పూలమాల, శాలువా, సన్మాన పత్రంతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యభారత్ ఫౌండషన్ ప్రతినిధులు చింతా నాగరాజు, రమేష్, కర్షక కవి ఆకుల రఘురామయ్య, దివాకర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కందికుంటకు శుభాకాంక్షల వెల్లువ



జ్ఞాపికను అందజేస్తున్న అభిమానులు

కేక్ కట్ చేస్తున్న నల్లచెరువు మండల నాయకులు

కేక్ కట్ చేస్తున్న తనకల్లు మండల నాయకులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ జన్మదిన వేడుకలతో పాటు నూతన సంవత్సరం శోభ సంతరించుకుంది. ఎమ్మెల్యే కందికుంట జన్మదిన వేడుకలు ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు . పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు, అధికారులు తరలివచ్చి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కు పుష్పగుచ్ఛాలు, పూల హారాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి శ్రేణుల మధ్య ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కేక్ కట్ చేసి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి శ్రేణులు నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు కదిరి పట్టణం పివిఆర్ గ్రాండ్ నందు కౌలేపల్లి కి చెందిన నిరుపేద 100 కుటుంబాలకు సన్నబియ్యం ప్యాకెట్లు పంపిణీ చేశారు, అనంతరం హిందూపురం రోడ్లో గల మాధవ గురుకులంలో ఉన్న 50 మంది పిల్లలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ప్రత్యేక చిత్రపటాలు బహూకరణ : కదిరి పట్టణానికి చెందిన కందుకూరు గణేష్ ధాన్యం గింజలతో చేసిన చిత్రపటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.అలాగే కదిరి రూరల్ మండలం ఎర్రదొడ్డి పంచాయతీ వై కొత్తపల్లికి చెందిన మచ్చ మధుసూదన కుమారుడు మచ్చ ఓంకార్ తన స్వహస్తాలతో ఎమ్మెల్యే కంది కుంట చిత్రపటాన్ని గీసి ఈ చిత్రపటాన్ని కందికుంటను అందజేశారు. ఈ కార్యక్రమంలో, ఎర్రదొడ్డి పంచాయతీ కొత్తపల్లికి చెందినటువంటి మచ్చ రామచంద్ర మచ్చ శంకర , ఎర్రదొడ్డికి చెందిన పచ్చర్ల శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

నల్లచెరువు : స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలో నిర్వహించారు. బస్టాండ్ సర్కిల్లో తెలుగుదేశం నాయకులు 30కేజీల కేట్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాబు సాబ్, ప్రసాద్ నాయుడు, హోటల్ రాంప్రసాద్, నాగార్జున, హర్షవర్ధన్ నాయుడు, కరే రవికుమార్, చంద్ర, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండల పరిధిలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు గురువారం కందికుంట జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భారీ కేట్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీరాములు నాయుడు, సొసైటీ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ రవిశంకర్, మాజీ జెడ్పిటిసి కెపి అంజనప్ప నాయుడు, పాల గిరి భాష, నరసింహులు, ఎం రవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : స్థానిక మూడు రోడ్ల కూడలిలో తలుపుల మండల కన్వీనర్ మేడ శంకర్ ఆధ్వర్యంలో కదిరి శాసనసభ్యులు కందికుంట మండల ప్రసాద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ముందుగా పెద్ద ఎత్తున టపాసులు కాల్చి అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీర భార్గవ్ రెడ్డి, కృష్ణ ఓబుళరెడ్డి, ముబారక్, రాజారెడ్డి, గంగరాజు, దేవేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సూగూరు చెరువుకు కృష్ణాజలాలు

ప్రజాశక్తి-హిందూపురం

ఎట్టకేలకు కృష్ణా జలాలు గురువారం సూగూరు చెరువు చేరుకు న్నాయి. దీంతో టిడిపి నాయకులు కిరికెర చెరువు వద్ద ఎమ్మెల్యే బాలకృష్ణ చిత్రపటాలను చేత పట్టుకుని గంగ పూజ నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో హిందూపురం మండలం టీడీపీ కన్వీనర్ హెచ్.ఎన్.రాము, మాజీ ఎంపీటీసీలు అంజి, ఆంజనేయులు, ప్రకాష్, రామకృష్ణ, రామగిరి సూరి, మూర్తి, గోపాల్,సుధాకర్ రెడ్డి, ఆచారి, సమర, శివ, ఆది, జయరాం, రైతులు, ప్రజలు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగపూజ చేస్తున్న నాయకులు

జిల్లా కలెక్టర్ వారి కార్యలయము (పంచాయితీ వారి విభాగము)
శ్రీ సత్యసాయి జిల్లా, పుట్లపర్తి, తేదీ :01-01-2026

రె.క.నెం.20/DPRC/2025 తేదీ:01-01-2026

టెండర్ ప్రకటన

పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాబివృద్ధి శాఖ వారి సూచనలు మేరకు గ్రామీణ ప్రాంతలలో రోజువారి చెత్త సేకరణ మరింత పట్టిపరుచుటకు శ్రీ సత్యసాయి. పుట్టపర్తి జిల్లా యందు మండల యూనిట్‌గా 1.చిలమత్తూర్ 2.కదిరి 3.సోమందేపల్లి 4.ముదిగుబ్బ మండలాలలో మండలం ఒక యూనిట్లా 'స్వచ్ఛరథం' నిర్వాహణ కోసం అర్హులైన వ్యక్తులు/సంస్థలు/స్క్రాప్ డీలర్లు/ఆపరేటర్ల నుండి దరఖాస్తులు అహ్వానించడమైనది. ప్రతి మండలము ఒక యూనిట్ కనుక విడివిడిగా దరఖాస్తులు సమర్పించాలి. వర్తించే గరిష్ట వయబిలిటీ గ్యాప్ ఫండింగ్(మోడల్-/కి రూ.25000/-నెల).

అర్హతలు

స్క్రాప్ డీలింగ్, ఘన వ్యర్థాల సేకరణ లేదా పునర్వినియోగపరచదగిన పదార్థల నిర్వాహణలో కనీసం మూడు (3) సంవత్సరాల ధృవీకరించదగిన అనుభవం కలిగి ఉండాలి.
స్క్రాప్ లేదా పునర్వినియోగపరచదగిన పదార్థాల నిర్వాహణ కోసం చెల్లుబాటు అయ్యే ట్రేడ్ లైసెన్స్/రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి.

దరఖాస్తుదారుడు దరఖాస్తును ఈ క్రింది వాటిని జతపరచాలి.

ఆధార్/పాన్ కాపీ.
నివాసం లేదా సంస్థ రిజిస్ట్రేషన్ రుజువు.
అనుభవ ధృవీకరణ పత్రం మరియు సహాయక పత్రాలు.
స్క్రాప్ డీలింగ్/MRF ఆపరేషన్ కోసం ట్రేడ్ లైసెన్స్,
GST రిజిస్ట్రేషన్(వర్తిస్తే).
గత మూడు సంవత్సరాల టర్నోవర్ స్టేట్మెంట్ మరియు IT రిటర్న్లు.
స్వచ్ఛ రథం కోసం ప్రతిపాదించబడిన వాహనం వివరాలు (RC కాపీ, డ్రైవింగ్ లైసెన్స్, కాలుష్య ధృవీకరణ పత్రం, బీమా ధృవీకరణ పత్రం, ఫిట్‌నెస్ సర్టిఫికేట్).
బ్యాంక్ పాస్ బుక్.
ఉమ్మడి ఆపరేషన్ వివరాలు, వర్తిస్తే (ఆపరేటర్ + వాహన యజమాని + స్క్రాప్ డీలర్ అమరిక).
అధికారుల నుండి నెలకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పొందడానికి బిల్డర్ కోట్ చేసిన మొత్తం (సీలింగ్ పరిమితి మోడల్-I కి రూ.25,000,

పాస్ పోటో సైజు ఫోటోగ్రాఫ్ మరియు సంప్రదింపు వివరాలు:-

దరఖాస్తుదారుడు రూ.10,000/- డిమాండ్ డ్రాఫ్ట్‌ను MPDO చిరునామాతో దరఖాస్తుతో పాటు సంబంధిత MPDOలకు సమర్పించాలి. **ఇది తొరిగి చెల్లించబడదు.**
పైన తెలిపిన విధముగా దరఖాస్తులు జిల్లా గ్రామ పంచాయితీ అధికారి, శ్రీసత్యసాయి జిల్లా వారి కార్యాలయము, పుట్టపర్తి నందు సమర్పించవలెను.
ధరఖాస్తులు సమర్పించుటకు 01-01-2026 నుండి చివరి తేది 07-01-2026.
టెండర్లు అమోదించుటకు గాని, రద్దు పరుచుటకు గాని మరియు వాయిదా వేయుటకు గాని జిల్లా పంచాయితీ అధికారి మరియు కన్వీనర్ వారికి పూర్తి అధికారం కలదు, ఇతర వివరములకు DRP(9652120800) జిల్లా పంచాయితీ అధికారి వారి కార్యాలయము వారిని సంప్రదించవలెను.

జిల్లా గ్రామ పంచాయితీ అధికారి, శ్రీ సత్యసాయి జిల్లా, పుట్టపర్తి

ఆనందోత్సాహాల నడుమ నూతన సంవత్సర వేడుకలు

జడ్జికి శుభాకాంక్షలు చెబుతున్న న్యాయవాదులు, తదితరులు



మడకశిర ఎమ్మెల్యేకు మహిళల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ, పరిసర ప్రాంతాల్లో నూతన సంవత్సర వేడుకలు ఆనందోత్సవాల నడుమ జరిగాయి. అర్ధరాత్రి 12 గంటలకు కాగానే యువకులు కేరింతలు కొడుతూ రోడ్లపైకి వచ్చి ఒకరికొకరు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అదే విధంగా పలువురు కేకులు కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. కాగా గురువారం ఉదయం నుండి నేతలు, ఉన్నతాధికారుల కార్యాలయాలు సందర్శకులతో కిటకిటలాడాయి. తమ నేతలు, అధికారులకు బొకేలు, పూలమాలలు, పండ్లు, స్వీట్లు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక అదనపు జిల్లా జడ్జి కం పల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ శ్రీధర్‌ను పలువురు న్యాయవాదులు, న్యాయస్థానాల సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాలకృష్ణ పిఏ బాలాజి, మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైసిపికార్యాలయంలో ఆ పార్టీ నేత వేణు రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలు నాయకులు నూతన సంవత్సర సంబరాలు జరుపుకున్నారు. దీనికి తోడు మాజీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నవీన్ నిశ్చల్ నాయకులకు, కార్యకర్తలకు తిరుపతి ప్రసాదంతో పాటు గోడ గడియారంలు అందించారు. మున్సిపల్ కార్యలయంలో కమిషనర్ మల్లికార్జునను, తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వెంకటేశుకు అధికారులు, కార్యాలయం సిబ్బంది, కాంట్రాక్టర్లు, పట్టణ ప్రముఖులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదిలా ఉండగా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం నుండి చర్చి నిర్వాహకులు చర్చిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చర్చిలో కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అదే విధంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మడకశిర టౌన్: మండలంలో గురువారం ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. కేకలు కట్ చేసి స్వీట్లు పంచుకొని నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలకు శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గ ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. అలాగే సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డికి నీలకంఠాపురంలో పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

గుడిబండ : వైసిపి ఆధ్వర్యంలో గురువారం గుడిబండలో రొళ్ళ మండల వైసిపి జడ్పిటిసి సభ్యులు అనంతరాజు జన్మదినం, ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా గుడిబండ జడ్పిటిసి సభ్యులు భూతరాజు, మాజీ ఎంపీపీ ఎల్‌కె.నరసింహప్ప, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు చంద్రప్ప, నాయకులు శివకుమార్, సర్పంచులు రంగస్వామి, లక్ష్మీనారాయణప్ప ఆధ్వర్యంలో బస్టాండ్‌లో ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున టపాసులు పేల్చారు. ప్రజలకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గుడిబండ, రొళ్ళ మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

సందర్శకులతో కిటకిటలాడిన నేతల ఇళ్లు

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. టిడిపి నాయకులు కార్యకర్తలు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. అలాగే వైసిపి నాయకులు కార్యకర్తలు, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని అధికారులు, జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు వారి శాఖల జిల్లా ఉన్నతాధికారులను కలిసి అభినందనలు తెలిపారు.

పుట్టపర్తి రూరల్ : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగ వారు కలెక్టర్‌కు పూల మొక్కలు అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : ఆంగ్ల నూతన సంవత్సరానికి పాంచజన్య పాఠశాలలో చిట్టి పొట్టి హృదయాలు హర్షాతిరేకాలతో స్వాగతం పలికాయి. కిండర్ గార్టెన్ డే సందర్భంగా గురువారం సాయంత్రం నిర్వహించిన వేడుకలు విద్య, సంస్కృతి, సృజనాత్మకతల సమ్మేళనంగా నిలిచాయి. చిన్నారుల చిరునవ్వులు, తల్లిదండ్రుల గర్వం, పుర ప్రజల కరతాళ ధ్వనులతో పాఠశాల ప్రాంగణం ఉత్సవ వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమాలను పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, కరస్పాండెంట్, నందకుమార్ ప్రారంభించారు. చిన్నారుల ఆటపాటలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతు ఎల్‌కెజి, యూకెజి, మొదటి తరగతి విద్యార్థులు సాధారణంగా తమ పనులను తామే చేసుకోవడం కూడా తెలియని వయస్సులో ఉంటారన్నారు. అలాంటి వయసులోనే మీ పిల్లలు చదువులో ముందంజలో ఉండటమే కాకుండా, ఆటపాటల్లోనూ ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్లు స్మిత, నందిత, ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, సహాయ ప్రధానోపాధ్యాయులు శశికళ, సతీష్ కుమార్, అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : ముదిగుబ్బ రూరల్ సిఐగా వారం క్రితం బాధ్యతలు చేపట్టిన సునీతను సిపిఎం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బాబ్జాన్, కో కన్వీనర్ శ్రీరామ్ రెడ్డి, సిఐటియు నాయకులు పకీరప్ప, టైలర్ ముస్తఫా, ఆవాజ్ నాయకులు నౌషాద్, గులాబీ ప్రకాష్, రిక్షా ముస్తఫా, ట్రాలీ యూనియన్ హరి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురంలోని పాంచజన్య పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు